సాక్షి
రంగారెడ్డి
బుధవారం ı 30 ı అక్టోబర్ ı 2024



భూములు గుంజుకోవద్దు

గోశాల పేరుతో తమ భూములు లాక్కుంటే ఎలా బతుకుతాం.. అంటూ ఎనికేపల్లి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. 8లో▸



సమస్యలు పరిష్కరించండి

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. 8లో▸



అవమానించారని..

కాలనీవాసుల ముందు కొట్టడంతో పాటు అవమానించారన్న మనస్తాపంతో ఓ యువకుడు ఇంట్లో నుంచి పారిపోయాడు. 8లో▸

తగ్గిన రియల్ కళ

గత ఏడాదితో పోలిస్తే పడిపోయిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రియల్ భూం జిల్లాలో ఒక్కసారిగా పడిపోయింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి తోడు.. పెరిగిన ధరలు.. వరుస ఎన్నికలు.. హైడ్రా కూల్చివేతలు ఆస్తుల క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం చూపాయి. 2023తో పోలిస్తే 2024లో ఆస్తుల రిజిస్ట్రేషన్ల సంఖ్య సహా తద్వారా ప్రభుత్వానికి సమకూరిన ఆదాయాన్ని పరిశీలిస్తే ఇదే అంశం స్పష్టమవుతోంది. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు జిల్లా వ్యాప్తంగా 2,48,188 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా, వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.3,893.26 కోట్ల ఆదాయం సమకూరింది. 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 2,04,103 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా, వీటి ద్వారా రూ.3,243.31 కోట్లు మాత్రమే సమకూరడం విశేషం.

జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్లు.. సమకూరిన ఆదాయం

2023	డాక్యుమెంట్లు	ఆదాయం (కోట్లలో..)
జనవరి	18,942	రూ.306.25
ఫిబ్రవరి	20,477	రూ.273.41
మార్చి	23,253	రూ.331.27
ఏప్రిల్	19,025	రూ.325.00
మే	23,184	రూ.338.55
జూన్	21,121	రూ.326.30
జూలై	21,089	రూ.256.82
ఆగస్టు	22,705	రూ.291.94
సెప్టెంబర్	21,407	రూ.350.10
అక్టోబర్	18,822	రూ.339.49
నవంబర్	16,636	రూ.358.35
డిసెంబర్	21,527	రూ.395.73

మందగించిన మార్కెట్

కోవిడ్ సంక్షోభం తర్వాత జిల్లాలో రియల్

జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్లు.. సమకూరిన ఆదాయం

2024	డాక్యుమెంట్లు	ఆదాయం (కోట్లలో..)
జనవరి	18,818	రూ.274.32
ఫిబ్రవరి	22,272	రూ.397.27
మార్చి	21,451	రూ.406.85
ఏప్రిల్	18,426	రూ.319.30
మే	19,448	రూ.290.91
జూన్	21,103	రూ.332.99
జూలై	28,729	రూ.459.94
ఆగస్టు	19,931	రూ.293.76
సెప్టెంబర్	16,689	రూ.222.36
అక్టోబర్	17,236	రూ.245.56

భూం ఒక్కసారిగా పెరిగింది. నగరానికి ఆనుకుని ఉన్న కోకాపేట, నార్సింగి, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, మొయినాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, పెద్ద అంబర్‌పేట్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మణికొండ, తుక్కుగూడ, ఆదిబట్ల, కొత్తూరు, మహేశ్వరం, తదితర ప్రాంతాల్లో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. కోకాపేటలో ఎకరం ఏకంగా రూ.100 కోట్లకుపైగా పలికింది. ఓఆర్ఆర్‌కు అటు ఇటుగా కొత్తగా అనేక గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు, హైరేంజ్ అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వీటిలోని ప్లాట్లు, ఇళ్లు, ఖాళీ స్థలాలు కొనుగోలు చేసేందుకు నగరవాసులే కాకుండా దేశవిదేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు, బహుళ జాతి కంపెనీలు ఆసక్తి చూపాయి. ఫలితంగా జిల్లాలో రోజుకు సగటు 750 నుంచి 1000 ఆస్తులు రిజిస్ట్రేషన్లు జరిగేవి. రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరేది. అసెంబ్లీ ఎన్నికలు.. ఆ తర్వాత కొద్ది కాలానికి లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. దీనికి తోడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం హైడ్రాను తీసుకొచ్చింది.

అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి తోడు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టడంతో ఆస్తుల అమ్మకాలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి.. ఆ శాఖ ద్వారా ప్రభుత్వానికి సమకూరాల్సిన ఆదాయం భారీగా పడిపోయింది. భవిష్యత్తుపై ఆశతో భూములపై భారీగా పెట్టుబడి పెట్టిన చిరు వ్యాపారులు తమ వెంచర్లలోని ఖాళీ

రియల్టర్లు విలవిల

స్థలాలు అమ్ముడుపోక ఆర్థికంగా చితికిపోతున్నారు. అప్పటి వరకు రియాల్టీపై ఆధారపడిన కమీషన్ ఏజెంట్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఒకప్పుడు ఖరీదైన కారు, ఒంటి నిండా బంగారు ఆభరణాలు, విలాసవంతమైన జీవితాన్ని గడిపిన రియల్టర్లు, కమీషన్ ఏజెంట్లు.. ప్రస్తుతం రోజువారీ ఖర్చుల కోసం తమ వద్ద ఉన్న భూములు, ఇళ్లు, ఇతర ఆస్తులు, బంగారు ఆభరణాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టాల్సిన దుస్థితి తలెత్తింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వానికి భూముల కొనుగోలు, అమ్మకాల ద్వారా రావాల్సిన ఆదాయం మరింత తగ్గే అవకాశం లేకపోలేదు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

విధుల్లో అలసత్వం వద్దు

- ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని అర్హులకు అందేలా కృషి చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించే సూపరింటెండెంట్లు, ఎన్యూమనేటర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆర్డీఓలు, తసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు, జిల్లా ప్రణాళిక అధికారులతో ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పథకాన్ని గ్రామం నుంచి పట్టణం వరకు అర్హులందరికీ అందేలా కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. రాజధానికి ఆనుకొని ఉన్న జిల్లాకు అధికారిగా రావడం ఆనందంగా ఉందన్నారు.

జిల్లాకు చెడ్డపేరు తేవొద్దు

ప్రతి ఉద్యోగి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వంద శాతం టీమ్ వర్క్‌తో జిల్లాను అభివృద్ధి చేసే దిశగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు శ్రద్ధగా పని చేయాలన్నారు. జిల్లాకు చెడ్డపేరు తేవొద్దని సూచించారు. నిజాయితీగా, నిక్కచ్చిగా పని చేయాలన్నారు.

తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దు

సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహించడం జరుగుతుందని, సర్వే కోసం ఎన్యూమనేటర్లు, ఎన్యూమనేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. మండలం వారీగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు ఎన్యూమనేటర్ల ఎంపికను శ్రద్ధతో చేపట్టి వివరాలను బ్లాక్ వారీగా అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. సర్వేను వేగంగా, విజయవంతంగా పూర్తి చేయడానికి అత్యుత్తమ ఎన్యూమనేటర్లను ఎంపిక చేయాలన్నారు. అవసరమైతే అదనంగా 10 శాతం ఎమ్యూనేటర్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

సర్వేనే ప్రామాణికం

ప్రతి తహసీల్దార్, ఎంపీడీఓ దగ్గర గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నివాస స్థలాల మ్యాప్‌లు, హౌస్ లిస్టింగ్ ఫార్మాట్, 56 ప్రశ్నల ఫార్మాట్, సర్వే పూర్తయిన ఇంటిపై అతికించే స్టిక్కర్ అందుబాటులో ఉండాలని చెప్పారు. సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎలాంటి తప్పులు లేకుండా, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాథమిక డేటాను ఈ నెల 30వ తేదీ వరకు, పూర్తి స్థాయి డేటాను నవంబర్ 1వ తేదీలోపు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ సంగీత, జిల్లా ప్రణాళిక అధికారి పి.సౌమ్య, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

5న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం



తాత్కాలిక కమిటీ సభ్యులు

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని నవంబర్ 5న నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకుందామని అన్నారు. ఎలాంటి కక్ష సాధింపుధోరణికి పోకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగేందుకు ఉద్యమకారుల సంక్షేమాన్ని సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 5న పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో ఉన్న వాద్యాల వసంత రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం తాత్కాలిక అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారులుగా కళ్లెం నర్సింహారెడ్డి, రాంబల్ నాయక్, మంగులాల్ నాయక్, ఎమ్మె సత్తయ్య, గౌరవ అధ్యక్షులుగా పినపాక ప్రభాకర్, మిట్టు నాయక్, చైర్మన్‌గా వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్లుగా ఆర్ల యాదయ్య, జాంగారి రవి, కన్వీనర్లుగా నక్కల వెంకటేశ్‌గౌడ్, మన్నె నారాయణ, కోకన్వీనర్లుగా మహ్మద్ సిరాజుద్దీన్, జాంగారి నర్సింలు, కోఆర్డినేటర్‌గా దిలీప్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ



నియామక పత్రాలు అందిస్తున్న నాయకులు

కందుకూరు: జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ వద్ద ఉన్న టీఎన్‌జీఓ భవనంలో మంగళవారం టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కొత్త కమిటీని ప్రకటించారు. జిల్లా పంచాయతీ కార్యదర్శులు సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్ గౌడ్ (మోకిలతండా), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్.రాఘవేందర్ (మజీద్‌పూర్), కె.రాంబాబు (బాటసింగారం), నర్సింహులు (ఇన్ముల్‌నర్వ), పి.పురుషోత్తంరెడ్డి (రాజాపూర్), కె.శేఖర్ (చేవెళ్ల), ప్రధానకార్యదర్శిగా పానుగంటి రాజుగౌడ్ (గంగాపూర్), సంయుక్త కార్యదర్శులుగా జి.ఇందిర (చెల్లంపల్లి), కె.వజ్రలింగం (కవ్వగూడ), కోశాధికారిగా బి.శ్రీధర్ (తిమ్మాపూర్), కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.వెంకటేశం(చిలుకూరు), పబ్లిసిటీ సెక్రటరీగా బి.శ్రీనివాస్(కల్వకోలు), కార్యవర్గ సభ్యులుగా జె.వెంకట్‌రెడ్డి (మక్తమాదారం), ఎం.శరత్‌కుమార్ (తలకొండపల్లి), శోభ (గున్‌గల్), ఎస్.జానయ్య (కందుకూరు), సి.వెంకటయ్య (జ్వేత్వారం)ను ఎన్నికయ్యారు.

3న ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: నవంబర్ 3న తలపెట్టిన ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు తుల సిగారి రవీందర్ కోరారు. ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం మహా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కేబీఆర్ కాన్షిరాం ప్రాంగణంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్రవర్ణ, భూస్వామ్య, రాజకీయ వ్యవస్థలపై యుద్ధం చేసేందుకు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, శ్రామిక ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకొనేలా అధికారం సాధన కోసం డా. విశారదన్ మహరాజ్ ధర్మ సమాజ్ పార్టీని స్థాపించినట్లు గుర్తు చేశారు. అగ్రవర్ణ పాలకవర్గాల దోపిడీని అరికట్టేందుకు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణంపై సమీక్షతోపాటు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై ఈ ప్లీనరీలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కన్వీనర్ అమరేందర్, కో–కన్వీనర్ నాగార్జున, పి.శేఖర్, నాయకులు భవాని శేఖర్, భాస్కర్, శ్రీకాంత్, ప్రదీప్, లింగస్వామి, మహిపాల్, రంజిత్, శ్రావణ్ పాల్గొన్నారు.



సాగర్ రహదారిపై వివరాలు సేకరిస్తున్న లీ సంస్థ ప్రతినిధి బృందం

‘ఫ్యూచర్- 2050’ కోసం సర్వే

వివరాలు సేకరించిన లీ సంస్థ

యాచారం: హెచ్‌ఎండీఏ పరిధిలో ఫ్యూచర్–2050కి ప్రయాణికుల సౌకర్యార్థం ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అంశంపై సర్కార్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో లీ అనే సంస్థ 24 గంటల పాటు ప్రయాణికుల నుంచి సమాచారాన్ని సేకరించింది. హెచ్‌ఎండీఏ పర్యవేక్షణలో సోమవారం ఉదయం 8 నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు లీ అసోసియేషన్ సౌత్ ఏసియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇంజినీరింగ్ బృందం ప్రతినిధులు సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలను నిలిపి వివరాలు సేకరించారు. ఫ్యూచర్–2050 కోసం హెచ్‌ఎండీఏ పరిధిలో రోడ్డు విస్తరణ, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రయాణికుల సౌకర్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అభివృద్ధి, వసతులపై అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఫ్యూచర్–2050 వచ్చే వరకు ఇదే రోడ్డు ఇలానే ఉండాలా.. లేదా విస్తరణ చేయాలా.. విస్తరణ చేస్తే ఎన్ని వరుసలు చేయాలి, ప్రస్తుతం ఉన్న సాగర్ హైవేను ఎన్ని వరుసలు విస్తరణ చేస్తే బాగుంటుంది, యాచారం వరకు మెట్రో రైలు విస్తరణ చేయాలా.. వద్దా.. హెచ్‌ఎండీఏ ప్రాంతం ఇంటి నిర్మాణాలతో నిండిపోతే తాగునీటి సమస్య తీర్చేదేలా, తాగునీటి సమస్యకు ఏ మార్గం కావాలి, ప్రస్తుతం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటి సరఫరా సరిపోతుందా.. లేదా ప్రత్యేక పైపుల ద్వారా నీటి సరఫరా చేయాలా తదితర వివరాలు సేకరించారు. లీ సంస్థ ప్రతినిధులతో పాటు హెచ్‌ఎండీఏ, ట్రాఫిక్ పోలీస్ బృందం ఈ సర్వేలో పాల్గొంది.

36,51,513

- జిల్లాలో ఓటర్ల సంఖ్య
- ముసాయిదా విడుదల
- పురుషులు : 18,78,308
- మహిళలు : 17,72,774
- ఇతరులు : 431



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటర్ల ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి మంగళవారం వెల్లడించారు. ముసాయిదాపై నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. ఏడాది వ్యవధిలోనే కొత్తగా 1,28,294 మంది ఓటు హక్కు పొందారు. గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల నాటికి జిల్లా వ్యాప్తంగా 35,23,219 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం వీరి సంఖ్య 36,51,513 మందికి పెరిగింది. పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా 3,453 నుంచి 3,501కి చేరింది. తాజా ముసాయిదా ప్రకారం జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 36,51,513 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 18,78,308 మంది పురుషులు, 17,72,774 మంది మహిళలు, 431 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో 315 మంది ఎన్ఆర్ఐ, 618 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఇబ్రహీంపట్నం	359	172134	169887	35	342056
ఎల్బీనగర్	577	314435	291079	132	605646
మహేశ్వరం	542	287685	274439	66	562190
రాజేంద్రనగర్	547	319700	297944	35	617679
శేరిలింగంపల్లి	639	403352	360769	143	764264
చేవెళ్ల	298	136846	136338	05	273219
కల్వకుర్తి	271	123934	121436	02	245372
షాద్‌నగర్	268	120222	120842	13	241087

సమయం పెంచుతాం.. భోజన సౌకర్యం కల్పిస్తాం

గ్రూప్–2 అభ్యర్థులకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ హామీ



గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగట్టి మధుసూదన్‌రెడ్డితో అభ్యర్థులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రూప్–2 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు జిల్లా గ్రంథాలయ సమయాన్ని రాత్రి 10 నుంచి 12 గంటల వరకు పెంచినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగట్టి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పలువురు అభ్యర్థులు ఆయన్ను కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో మంగళవారం గ్రూప్–2కు దాదాపు 120 మంది అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నట్లు తెలిపారు. రాత్రి పది గంటల వరకే ఉన్నందున, సమయం సరిపోవడం లేదని, మరింత పెంచాలని కోరారు. భోజన వసతి కల్పించాలని విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన అదనపు సమయంతో పాటు విద్యార్థులకు 45 రోజుల పాటు సొంత ఖర్చుతో భోజన సదుపాయం కల్పించేందుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ట్రైకార్ నిధులు విడుదల చేయండి

గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.265 కోట్ల ట్రైకార్ నిధులను వెంటనే విడుదల చేయాలని, నూతన యాక్షన్ ప్లాన్ ప్రకటించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కార్యదర్శి జర్పుల శివనాయక్ అధ్యక్షతన రాష్ట్ర సమితి పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమావత్ అంజయ్య నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 32,122 మంది లబ్ధిదారులకు గిరిజన కార్పొరేషన్ ట్రైకార్ నిధులు రూ.265 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గిరిజనులు ప్రభుత్వం తరఫున వచ్చే బ్యాంకు లోన్లు సబ్సిడీలకు నాలుగేళ్లుగా దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా నిధులు రాలేదన్నారు. వెంటనే యాక్షన్ ప్లాన్ తయారు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమలలో సీపీఐ రాష్ట్ర నాయకులు యాదయ్య, చంద్రశేఖర్, రాజు, శంకర్‌నాయక్, లోక్యా, సరిలాల్, చత్రు, జజాల అంజయ్య, సారయ్య, రవి నాయక్, తిరుపతి నాయక్, టిక్యా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జయశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు ఆధ్వర్యంలో మంగళవారం పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఎస్ఆర్ కళా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాలకవర్గం ప్రవేశపెట్టిన 45 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఇప్పటికే ప్రారంభించిన సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్‌గౌడ్, మనెమ్మ, విద్యావతి, అనురాధ, రాజేందర్‌ముదిరాజ్, డి.కృష్ణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, దీపిక, లక్ష్మణ్, నరేందర్‌రెడ్డి, రోహిణి, అర్చన, కోటేశ్వరరావు, పరశురాం, గీత, సుజాత, హరిశంకర్, ఎస్.కృష్ణారెడ్డి, అనుపమలతో పాటు కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి



ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇస్తున్న పీఆర్‌టీయూ నేతలు

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకునేందుకు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. సంఘం మండల అధ్యక్షుడు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డిల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో పదేళ్లుగా ఉద్యోగోన్నతి లేకుండ ఉన్నామన్నారు. నూతన ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రమోషన్స్ షెడ్యూల్‌ను విడుదల చేయించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రస్తుత పరిస్థితుల్లో రెండు డీఏలు ఇవ్వడానికి సిద్ధంగాఉంటేనాలుగింటినిఅమలు చేయించడం జరిగిందన్నారు. రూ.వెయ్యి కోట్ల అదనపు భారం పడుతుందని గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బిల్లులను ప్రస్తుత సర్కారు చెల్లించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అనంతరం అబ్దుల్ హమీద్, నారాయణ పీఆర్‌టీయూటీఎస్‌లో చేరారు. సమావేశంలో బందయ్య, హన్మంతు, రవీందర్ రెడ్డి, రేణుక, మల్లయ్య, సత్యనారాయణరెడ్డి, ఆంజనేయులు,వెంకటయ్య,శివకుమార్, యాదగిరి, రాములు, వేణుగోపాల్, సంజీవన్‌కుమార్, లక్ష్మణ్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా భూములు గుంజుకోవద్దు

- గోశాలకు కేటాయించడంతో దళిత రైతుల ఆందోళన
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- బాధితులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య మద్దతు



తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్: అరవై ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్నాం.. పంటలు పండించుకుంటున్నాం.. గోశాల పేరుతో ఇప్పుడు మా భూములు గుంజుకుంటే ఏలా బతుకుతాం.. అంటూ మండలంలోని ఎనికేపల్లి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మంగళవారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మండల పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 180లో 99 ఎకరాల ప్రభుత్వ భూమిని సుమారు అరవై ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన 50 దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయి. ఆ భూములను ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ గోశాలకు కేటాయించింది. తాము సాగుచేసుకుంటున్న భూములను గోశాలకు ఇవ్వొద్దంటూ బాధితులు ఆందోళన చేపట్టారు.

వినతిపత్రం అందజేత

విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన బాధితులకు మద్దతుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అరవై ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్నామని.. అప్పట్లో పటేల్ పట్వారి వ్యవస్థ ఉండి తమ పేర్లను రికార్డుల్లో నమోదు చేయలేదని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. సాగు చేసుకుంటున్నవారంతా దళిత కుటుంబాలకు చెందినవారమేనని.. ఈ భూములు గుంజుకుంటే తమకు బతుకుదెరువు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు భూములను గోశాలకు ఇస్తామని తమను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేకు గోడు వెలిబుచ్చారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే సమక్షంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

ఎనికేపల్లిలో దళితులు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూముల జోలికి అధికారులు వెళ్లొద్దని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు సూచించారు. ఈ భూముల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. దళిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తానని.. ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు మహేందర్, రాజుగౌడ్, రాము, రమేశ్, శ్రీనివాస్ తదితరులు బాధితులకు మద్దతు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

షాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల దక్షిణ మధ్య క్షేత్ర ప్రముఖ విద్యాలయ అధ్యక్షుడు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తమ ఉద్యమ కార్యాచరణలో భాగంగా షాబాద్ డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను సత్వరమే ప్రకటించాలన్నారు. పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగమేశ్వర్‌రెడ్డి, సుభాష్, సుభాష్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిశిరాత్రి.. బైక్ అదుపుతప్పి

పొదల్లోకి దూసుకెళ్లడంతో వ్యక్తి దుర్మరణం



మల్లేశ్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: రాత్రి వేళ బైక్ అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఉదయం వరకు ఎవరూ చూడకపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామశివారులో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన అంబటి మల్లేశ్(42) అనిత దంపతులు. వ్యవసాయం చేస్తూ జీవనోపాధిని పొందుతున్నారు. మల్లేశ్ బైక్‌పై సోమవారం కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో ఆయన దూసకల్ సమీపంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలోకి రాగానే రోడ్డు మలుపు ఉండటంతో బైక్ అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

రాత్రంతా ఎవరూ చూడలేదు

భర్త ఇంటికి రాకపోవడంతో మల్లేశ్ భార్య అనిత ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో చీకటి కావడంతో ఇన్ముల్‌నర్వలోనే ఉన్నాడని అనుకుంది. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లే రైతులు రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించి మల్లేశ్ ఫోన్‌తో ఇంటికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలానికి చేరుకొని మృతుడిని గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ అనంతరాములు తెలిపారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

డివైడర్ ఢీకొని.. విద్యార్థి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: సరదాగా బైక్‌పై వెళ్లిన ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషాద సంఘటన ఆదిబట్ల ఠాణా పరిధిలో చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బాలాపూర్ ప్రాంతానికి చెందిన మెగావత్ పవన్(21) మల్లాపూర్‌లోని గ్రీన్‌ఫీల్డ్ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్నాడు. అతడు సోమవారం స్నేహితులతో వెళ్తున్నానని ఇంట్లో నుంచి బైక్ తీసుకొని బయటికి వెళ్లాడు. అదేరోజు అర్ధరాత్రి బొంగ్లూర్‌లో నంది వైన్స్ ఎదుట బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పవన్ అక్కడిక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. మంగళవారం శవ పరీక్ష చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నంపై స్పష్టత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం టీజీఎస్పీ 3వ బెటాలియన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ తనకు సెలవు ఇవ్వాలంటూ ఉన్నతాధికారులతో మంగళవారం పట్టుబట్టినట్లు వదంతులు వ్యాపించాయి. సమస్యలు పరిష్కారించాలని టీజీఎస్పీ పోలీసులు కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు కానిస్టేబుల్ సెలవు కావాలంటూ మొండికేయడమే కాక పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వదంతులు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ఘటనపై స్థానిక సీఐ సత్యనారాయణను సంప్రదించగా.. దీనిపై ఎలాంటి ఫిర్యాదు తమకు రాలేదన్నారు. పెట్రోల్‌తో కానిస్టేబుల్ ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు వచ్చిన సమాచారం వాస్తవం కాదన్నారు. అయితే 3వ బెటాలియన్ కానిస్టేబుల్ ఒకరు సెలవు కావాలని ఆడగ్గా.. సంబంధిత ఉన్నతాధికారులు అతనికి సెలవు ఇచ్చి పంపినట్లు మాత్రమే తనకు సమాచారముందని సీఐ తెలిపారు.

ఫేక్ డాక్యుమెంట్లు పెట్టి..

రూ.50 కోట్ల రుణానికి దరఖాస్తు

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో బయటపడిన ఫోర్జరీ బాగోతం
- ఇబ్రహీంపట్నం పీఎస్‌లో కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: ఫోర్జరీ సంతకాలతో ఎన్‌ఓసీ, సాల్వెన్సీ సర్టిఫికెట్లు సృష్టించి రూ.50 కోట్ల బ్యాంకు రుణం కొట్టేసేందుకు యత్నించిన తండ్రీకొడుకులపై కేసు నమోదైంది. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కప్పపహాడ్ గ్రామ సర్వే నంబర్లు 131 నుంచి 166లో రావి శ్రీనివాస్‌రావు, ఇతని కుమారుడు రావి చక్రధర్‌కు కలిపి మొత్తం 73 ఎకరాల భూమి ధరణి రికార్డుల్లో ఉంది. ఈ భూమిపై వసుంధర ఇంటిగ్రేటెడ్ శాటిలైట్ టౌన్‌షిప్, రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో.. ముంబై సిండికేట్ ఫైనాన్స్ బ్యాంకులో రూ.50 కోట్ల రుణానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్‌ఓసీ, సాల్వెన్సీ సర్టిఫికెట్లను ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేసినట్లు బ్యాంకుకు సమర్పించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చిన బ్యాంక్ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయానికి లేఖ రాశారు. అయితే తాము ఎవరికీ ఎన్‌ఓసీ, సాల్వెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆఫీసు స్టాంపులు, డిప్యూటీ తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఈ విషయమై తహసీల్దార్ సునీత ఇబ్రహీంపట్నం పోలీసుల ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

పని కోసం వెళ్తూ.. ప్రాణాలు విడిచి

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: పొట్ట చేత పట్టుకొని బతుకు దెరువు కోసం వలస వచ్చారు.. పనికోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలను పోగొట్టుకున్నాడు.. పట్టణంలోని దూసకల్ బైపాస్ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన చందన్‌కుమార్(30), సూరజ్‌కుమార్ బావ బావమరుదలు. కొంత కాలం క్రితం నగరానికి వలస వచ్చారు. ఉప్పల్ రామాంతాపూర్‌లో వెల్డింగ్ పనులు చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. ఇరువురూ వెల్డింగ్ పని నిమిత్తం మంగళవారం ఉదయం బైక్‌పై హైదరాబాద్ నుంచి షాద్‌నగర్‌కు బయలు దేరారు. మార్గమధ్యలో పట్టణ సమీపంలోని దూసకల్ బైపాస్ రహదారి ముఖ్య కూడలికి రాగానే హైదరాబాద్ నుంచి జడ్చర్ల వెళుతున్న డీసీఎం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చందన్‌కుమార్ పైనుంచి డీసీఎం వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున మరో వ్యక్తి గాయాలతో బయట పడ్డాడు. మృతుడి బావమరిది సూరజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సుశీల తెలిపారు.

బాలికపై అత్యాచారం

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలిక మన్నెగూడ పరిధిలో మేనమామ దగ్గర ఉంటుంది. బాలిక తల్లిదండ్రులు గతంలోనే మరణించారు. ఈ నెల 25వ తేదీన మల్లేపల్లిలో దుస్తువులు తీసుకొని వస్తానని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మన్నెగూడలోని ఎస్‌ఎస్‌ఆర్ నగర్‌లో నివాసం ఉండే పోతుల ప్రవీణ్(23) తీసుకెళ్లినట్లు గుర్తించారు. బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి అదృశ్యం



రూబీదేవి (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బిహార్ రాష్ట్రానికి చెందిన సిద్దినాథ్ సాహు, రూబీదేవి(38) దంపతులు 18 ఏళ్ల క్రితం జల్‌పల్లికి వలస వచ్చారు. భర్త కొత్తూర్‌లో జాబ్ చేస్తుండగా, భార్య జల్‌పల్లిలో కిరాణ దుకాణం నడుపుతుంది. ఈ నెల 25వ తేదీన భర్త ఉదయం విధులకు వెళ్లి రాత్రి తిరిగి వచ్చే సరికి భార్య కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లభించలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



మొయినాబాద్: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. చేవెళ్ల నియోజకవర్గంలోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. అదే విధంగా మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో దళితులు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూమిని గోషాలకు ఇవ్వకుండా వారికే పట్టాలు ఇవ్వాలని విన్నవించారు. సీఎంను కలిసిన వారిలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ ఉన్నారు.

అవమానించారని మనస్తాపం

- సహోద్యోగినులకు అసభ్యకర మేసేజ్‌లు పంపాడని దాడి
- ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యువకుడు
- ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా విశాఖలో పట్టుకున్న పోలీసులు



విశాఖపట్నం రైల్వే పోలీసుల అదుపులో నాగరాజు

మీర్‌పేట: కాలనీవాసుల ముందు కొట్టడంతో పాటు తనను అవమానించారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇంట్లో నుంచి పారిపోయాడు. తాను తప్పు చేశానని, తనను వెతకొద్దని లెటర్ రాసి వెళ్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా విశాఖపట్నంలో మంగళవారం పట్టుకున్నారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లెలగూడ కమలానగర్‌కు చెందిన కుంచెల వేణుగోపాల్ కుమారుడు నాగరాజు(20) గతంలో ఖైరతాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసి, రెండు నెలల క్రితం మానేశాడు. ఈ క్రమంలో నాగరాజు సహ ఉద్యోగినులకు అసభ్యకరమైన సందేశాలు పంపుతున్నాడు. ఇది గుర్తించిన కంపెనీ సిబ్బంది సోమవారం మధ్యాహ్నం అతడి ఇంటికి వచ్చి దాడి చేశారు. కాలనీలో అందరి ముందు కొట్టడంతో అవమానంగా భావించి వెళ్లిపోయాడు. తండ్రి ఫిర్యాదు అందుకున్న మీర్‌పేట పోలీసులు.. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గుర్తించి, నాగరాజును అదుపులోని తీసుకున్నారు. అతనిపై దాడికి పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని సీఐ తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం

తలకొండపల్లి: సభ్యసమాజం తలదించుకునేలా ఓ వృద్ధురాలిపై అత్యాచారం జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలి(60) భర్త కొన్ని సంవత్సరాల క్రితమే మరణించాడు. ఆమెకు ముగ్గురు సంతానం. ప్రస్తుతం ఒక్కతే ఇంట్లో ఉంటుంది. ఇంటి పక్కన ఉండే రమేశ్ వారం రోజుల క్రితం ఆమెపై అఘాత్యానికి పాల్పడ్డాడు. తాజాగా ఆమె ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీ

చేవెళ్ల: నిర్మాణంలో ఉన్న ఇంట్లో దుండగులు విద్యుత్ వైర్లను చోరీ చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రంలోని హైదరాబాద్–బీజాపూర్ హైవే పక్కనే శ్రీ వెంకటేశ్వర హార్డ్‌వేర్ షాపు యజమాని ఆంజనేయులుగౌడ్ కొత్త భవనం నిర్మిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దుండగులు నూతన భవనంలోకి ప్రవేశించి విద్యుత్ వైర్లు, లిఫ్టు కోసం వేసిన వైర్లను దొంగిలించారు. ఈ విషయం సీసీ కెమెరాల ద్వారా వచ్చిన సిగ్నల్‌తో గుర్తించిన యజమాని వచ్చే సరికి దొంగలు పారిపోయారు. సుమారు రూ.3 లక్షల విలువ గల సామగ్రి ఎత్తుకెళ్లారని బాధితుడు వాపోయారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.